రోహిత్‌కు ఆ సత్తా ఉంది

అతడు చాలా తెలివైన కెప్టెన్ : యువరాజ్ సింగ్

ఢిల్లీ: భారత జట్టు ఐసీసీ ట్రోఫీ కరువును తీర్చే సత్తా టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మకు ఉందని మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ అన్నాడు. వచ్చే నెల యూఎస్‌ఏ, వెస్టిండీస్ సంయుక్త వేదికలుగా జరగాల్సి ఉన్న టీ20 ప్రపంచకప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న యువీ ఐసీసీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'టీ20 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌శర్మ ఉండటం చాలా కీలకం. అతడు చాలా తెలివైన కెప్టెన్. ఒత్తిడిలో మంచి నిర్ణయాలు తీసుకునే సారథి మనకు (టీమ్‌ఇండియాకు) కావాలి. రోహిత్ ఆ కోవకు చెందినవాడే. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అతడు భారత్‌ను ఫైనల్‌కు చేర్చాడు. ఐపీఎల్‌లో ఐదు ట్రోఫీలు సాధించాడు' అని చెప్పాడు. 2007లో టీ20 వరల్డ్ కప్ నెగ్గిన భారత జట్టులో యువీ, రోహిత్ సభ్యులు. ఈ సందర్భంగా యువరాజ్.. రోహిత్‌తో జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నాడు. ఇన్నేండ్లలో అతడు ఆటగాడిగా, సారథిగా ఎంతో ఎత్తుకు ఎదిగినా రోహిత్ వ్యక్తిత్వంలో మాత్రం మార్పు రాలేదని, జట్టులో అందరితోనూ కలిసిపోతాడని ప్రశంసలు కురిపించాడు. వరల్డ్‌కప్ ట్రోఫీ, పతాకంతో రోహిత్‌శర్మను చూడాలని ఉందని యువీ ఆశాభావం వ్యక్తం చేశాడు.

అదరగొట్టిన భారత బాక్సర్లు

యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం

ఆస్తానా: గత రెండు వారాలుగా అస్తానా (కజకిస్థాన్) వేదికగా జరిగిన ఏషియన్ అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నీలో సోమవారం భారత్ ఐదు స్వర్ణాలు నెగ్గగా మంగళవారం మరో ఏడు గురు బాక్సర్లు పసిడి పతకాలతో రాణించారు. ప్రీతి (54 కిలోలు), నిఖిల్ (57 కిలోలు), ఆకాశ్ (60 కిలోలు), పూనమ్ (57 కిలోలు), ప్రాచి (63 కిలోలు), విశ్వనాథ్ (48 కిలోలు), ముస్కాన్ (75 కిలోలు) గోల్డ్ మెడల్స్ సాధించిన వారిలో ఉన్నారు. ఈ టోర్నీలో భారత్ 12 స్వర్ణాలు, 14 రజతాలు, 17 కాంస్య పతకాలతో (మొత్తం 43) రెండో స్థానంలో నిలిచింది. కజకిస్థాన్ 48 పతకాలతో అగ్రస్థానం దక్కించుకుంది.

కేకేఆర్ విమానం డైవర్షన్

వారణాసిలోనే ఉన్న ప్లేయర్లు

న్యూఢిల్లీ: కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేయర్లకు చేదు అనుభవం ఎదురైంది. లక్నో సూపర్‌జెయింట్స్‌పై భారీ విజయంతో సోమవారం సాయంత్రం కోల్‌కతాకు బయల్దేరిన జట్టు చార్టెడ్ విమానం వాతావరణ ఇబ్బందులతో పలుమార్లు డైవర్షన్ అయ్యింది. కోల్‌కతాలో విమానం ల్యాండ్ చేసేందుకు అనువైన పరిస్థితులు లేకపోవడంతో తొలుత గువాహటికి, తిరిగి వారణాసికి డైవర్షన్ చేశారు. దీంతో ఒకింత టెన్షన్ వాతావరణం నెలకొంది. తెల్లవారుజామున వారణాసికి చేరుకున్న కేకేఆర్ టీమ్ మంగళవారం స్వస్థలానికి బయల్దేరివెళ్లింది. ఈ విషయాన్ని కోల్‌కతా మీడియా బృందం వెల్లడించింది.

ఆసియా పారాగేమ్స్‌లో సత్తాచాటిన యువ అథ్లెట్ జీవాంజీ దీప్తికి నగదు ప్రోత్సాహం దక్కింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కోచ్‌లు గోపీచంద్, రమేశ్, దీప్తి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేసింగ్‌లో దూసుకుపోతున్న

చెన్నై చిన్నోడు

- **ఎఫ్‌ఐఎం జూనియర్ గ్రాండ్‌ప్రి 2వ రౌండ్ టాప్-10లో చోటు**

చెన్నై: భారత యువ బైక్ రేసర్, చెన్నైకి చెందిన కెవిన్ సమర్ క్వింటల్ ఎఫ్ ఐఎం జూనియర్ గ్రాండ్‌ప్రిలో అంచనాలకు మించి రాణించాడు. పోర్చుగల్‌లోని లిస్బన్ వేదికగా జరిగిన రెండో రౌండ్ రేస్ టాప్-10లో నిలిచాడు. ఫిఫ్టీ మోటార్‌స్పోర్ట్ టీమ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న 18 ఏండ్ల కెవిన్.. 11 ల్యాప్స్‌ను 23 నిమిషాల 19.001 సెకన్లలో పూర్తిచేశాడు. స్పెయిన్ కుర్రాడు అడ్రియన్ 16:092 నిమిషాల్లోనే గమ్యాన్ని చేరి మొదటిస్థానాన్ని దక్కించుకున్నాడు.

భారత జట్టు రెండో జాబితా ప్రకటన

ఢిల్లీ: ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్-2026లో అర్హత సాధించాలంటే కీలకంగా మారిన రెండో రౌండ్ మ్యాచ్‌లకు భారత ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్ 2వ జాబితాను కోచ్ ఇగార్ స్టిమాక్ ప్రకటించాడు. 15 మందితో కూడిన ఈ జాబితా (26 మందితో ఇదివరకే తొలి జాబితా విడుదల)లో ఉన్న సభ్యులు మే 10 నుంచి భువనేశ్వర్ వేదికగా నిర్వహించబోయే ట్రైనింగ్ క్యాంప్‌నకు హాజరుకావాల్సి ఉంది. జూన్‌లో మొదలుకాబోయే రెండో దశ పోటీలలో భారత్.. కువైట్, ఖతార్‌తో ఆడాల్సి ఉంది. వరల్డ్ కప్‌నకు అర్హత సాధించేందుకు ఈ రెండు మ్యాచ్‌లే భారత్‌కు ఆఖరి అవకాశం.

బంగ్లాదే సిరీస్

ఛత్తోగ్రామ్: స్వదేశంలో జింబాబ్వేతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో బంగ్లాదేశ్ జోరు కొనసాగుతోంది. మంగళవారం ఛత్తోగ్రామ్ వేదికగా ముగిసిన మూడో టీ20లో ఆతిథ్య జట్టు 9 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా.. నిర్ణీత 20 ఓవర్లలో 165/5 పరుగులు చేయగా ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 156/9 వద్దే ఆగిపోయింది.

రేసులోనే ఢిల్లీ

రాజస్థాన్‌పై విజయంతో ప్లేఆఫ్స్ ఆశలు సజీవం.. దంచికొట్టిన ఫ్రేజర్, పొరెల్

ఐపీఎల్-17 ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొట్టింది. బ్యాటింగ్‌లో ఫ్రేజర్, పొరెల్, స్టబ్స్ దంచికొట్టి ఆ జట్టుకు భారీ స్కోరు కట్టబెట్టారు. ఆ తర్వాత రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ వీరోచిత పోరాటం చేసినా ఆఖర్లో తడబడ్డ ఆ జట్టు వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది. ఈ సీజన్‌లో ఢిల్లీకి ఇది ఆరో విజయం కాగా 12 పాయింట్లతో పంత్ సేన పాయింట్ల పట్టికలో ఐదో స్థానంలోకి దూసుకొచ్చింది.

ఢిల్లీ: ఐపీఎల్-17 ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో సొంత వేదికపై జూలు విదిల్చింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా మంగళవారం రాత్రి రాయల్స్‌ను 20 పరుగుల తేడాతో చిత్తుచేసి ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఢిల్లీ నిర్దేశించిన 222 పరుగులు ఛేదనలో రాజస్థాన్ పోరాడినా కీలక సమయంలో వికెట్లు కోల్పోవడం ఆ జట్టును ఓటమిపాలుచేసింది. సంజూ శాంసన్ (46 బంతుల్లో 86, 8 ఫోర్లు, 6 సిక్సర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో పోరాడినా ఆ జట్టు 20 ఓవర్లలో 201/8 పరుగులకే పరిమితమైంది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ.. అభిషేక్ పొరెల్ (36 బంతుల్లో 65, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), జేక్ ఫ్రేసర్ (20 బంతుల్లో 50, 7 ఫోర్లు, 3 సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్ (20 బంతుల్లో 41, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచికొట్టడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 221 పరుగులు చేసింది. కుల్దీప్ యాదవ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

దంచుడే దంచుడు

తొలి ఓవర్ నుంచే బాదుడుకు గేట్లు ఎత్తేసిన ఢిల్లీ యువ సంచలనం ఫ్రేజర్ రాజస్థాన్ బౌలర్లపై పిడుగులా ఉరిమిపడ్డాడు. బౌల్ట్ 3వ ఓవర్లోనే ఓ సిక్స్, రెండు ఫోర్లతో ట్రాక్‌లోకి వచ్చిన అతడు.. అవేశ్‌ఖాన్ 4వ ఓవర్లో 4, 4, 4, 6, 4, 6తో 28 పరుగులు రాబట్టి 19 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. అశ్విన్ అతడి ఆట కట్టించినా బాదుడు బాధ్యతను పొరెల్ ఎత్తుకున్నాడు. సందీప్ శర్మ, చాహల్, పరాగ్, అవేశ్ ఓవర్లలో భారీ షాట్లతో రెచ్చిపోయాడు. 28 బంతుల్లోనే పొరెల్ అర్ధ శతకం పూర్తైంది. అక్షర్ పటేల్ (15), పంత్ (15), గుల్బాదిన్ (19) విఫలమైనా ఆఖర్లో స్టబ్స్ దంచడంతో ఢిల్లీ భారీ స్కోరుచేసింది.

శాంసన్ బాదినా..

భారీ లక్ష్య ఛేదనలో రాజస్థాన్ ఓపెనర్లు జైస్వాల్ (4), బట్లర్ (19) విఫలమయ్యారు. కానీ కెప్టెన్ శాంసన్ మాత్రం ఒంటరి పోరాటం చేశాడు. పరాగ్ (22 బంతుల్లో 27)తో కలిసి మూడో వికెట్‌కు 36 పరుగులు జోడించిన అతడు.. శుభమ్ దూబే (25) తో నాలుగో వికెట్‌కు 59 రన్స్ జతచేశాడు. 27 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసిన శాంసన్.. సలం వేసిన 13వ ఓవర్లో 6, 4, 6తో స్కోరు వేగాన్ని పెంచాడు. దూబే కూడా గేర్ మార్చడంతో రాజస్థాన్ లక్ష్యం దిశగా సాగింది. ఆఖరి 5 ఓవర్లలో ఆ జట్టు విజయానికి 63 పరుగులు అవసరమనగా.. ముకేశ్ 16వ ఓవర్లో థర్డ్ అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో శాంసన్ పెవిలియన్ చేరడంతో రాజస్థాన్ తడబడింది. మ్యాచ్‌లో ఇదే టర్నింగ్ పాయింట్. కుల్దీప్ ఒకే ఓవర్లో ఫెరెరా, అశ్విన్‌ను ఔట్ చేయడంతో రాయల్స్ ఓటమి ఖరారైంది.

పాయింట్ల పట్టిక

జ	ఆ	గె	ఓ	ర	పా
కోల్‌కతా	11	8	3	1.45	16
రాజస్థాన్	11	8	3	0.47	16
చెన్నై	11	6	5	0.70	12
హైదరాబాద్	11	6	5	-0.06	12
ఢిల్లీ	12	6	6	-0.31	12
లక్నో	11	6	5	-0.37	12
బెంగళూరు	11	4	7	-0.04	8
పంజాబ్	10	4	6	-0.06	8
ముంబై	12	4	8	-0.21	8
గుజరాత్	11	4	7	-1.32	8

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 221/8 (పొరెల్ 65, ఫ్రేజర్ 50, అశ్విన్ 3/24, సందీప్ 1/42). **రాజస్థాన్:** 20 ఓవర్లలో 201/8 (శాంసన్ 86, పరాగ్ 27, కుల్దీప్ 2/25, ముకేశ్ 2/30)

ఈశాన్యాన మరో క్రికెట్ స్టేడియం

త్రిపుర: 'సెవన్ సిస్టర్స్'గా పేరొందిన ఈశాన్య భారతాన మరో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సిద్ధమవుతోంది. బీసీసీఐ ఆర్థిక సహకారంతో త్రిపురలోని పశ్చిమ త్రిపుర జిల్లా నర్సింగర్‌లో దీని నిర్మాణ పనులు జరుగుతుండగా వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికల్లా పూర్తిచేయనున్నట్టు త్రిపుర క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) సెక్రటరీ సుబ్రత డే తెలిపారు. 2025 ఫిబ్రవరి తర్వాత రాష్ట్ర ప్రజలు అంతర్జాతీయ, ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించే అవకాశమున్నట్టు ఆయన చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలలో ప్రస్తుతం అస్సాంలోని బర్సపుర స్టేడియం మాత్రమే ఐపీఎల్, ఇంటర్నేషనల్ మ్యాచ్‌లకు ఆతిథ్యమిస్తోంది.

మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయిన ఉప్పల్ రాజీవ్‌గాంధీ క్రికెట్ స్టేడియం. బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్‌జెయింట్స్ మధ్య కీలక మ్యాచ్ జరుగనుంది. గెలిచి ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకోవాలని ఇరు జట్లు పట్టుదలతో ఉన్నాయి.

వాణిజ్య

టీ హబ్ 'స్టార్టప్ సాహస యాత్ర'

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): సరికొత్త ఆవిష్కరణలను, స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యంగా టీ హబ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.దీంట్లోభాగంగా ఇండియా స్టార్టప్ సాహస యాత్రను దేశీయంగా ప్రధాన 11 నగరాల్లో నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ నెల 8న కోయంబత్తూరులో, 10న కోచి, 24న మంగళూరు, జూన్ 7న డెహరాడున్, లక్నోలో జూన్ 14న, సూరత్‌లో జూన్ 28న, జూలై 5న రాంచీలో, 19న జైపూర్‌లో, 26న ఇండోర్‌లో, ఆగస్టు 9న భువనేశ్వర్, 23న గౌహతిలో నిర్వహిస్తున్నామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు.

శ్రీలంకకు అదానీ విద్యుత్తు

కొలంబో, మే 7: అదానీ గ్రీన్ ఎనర్జీతో 20 ఏండ్లపాటు విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి శ్రీలంక ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అక్కడి విద్యుత్తు శాఖ మంత్రి కాంచన విజేశేఖర మంగళవారం తెలిపారు. కాగా, కిలోవాట్ పర్ అవర్ ధర 0.0826 డాలర్లు (24.76 శ్రీలంక రూపాయలు) గా నిర్ణయించారు. ఇదిలావుంటే ఈ ఒప్పందంలో భాగంగా శ్రీలంకలోని మన్నార్, పూనెరిన్‌లలో 484 మెగావాట్ల ఉత్పాదక సామర్థ్యం కలిగిన పవన విద్యుదుత్పత్తి కేంద్రాలను అదానీ గ్రీన్ ఎనర్జీ ఏర్పాటు చేస్తున్నది.

పెరిగిన ఆరోగ్య బీమా ప్రీమియం

న్యూఢిల్లీ, మే 7: ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటున్నారా అయితే మీ జేబుకు మరిన్ని చిల్లులు పడబోతున్నాయి. ఇప్పటికే ప్రీమియం పెరగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరోగ్య బీమా పాలసీదారులపై బీమా సంస్థలు మరింత భారం మోపాయి. గడిచిన ఏడాదికాలంలో ఆరోగ్య బీమా ప్రీమియంను 25 శాతం వరకు పెంచాయి. ఈ విషయాన్ని లోకల్‌సర్కిల్ తాజాగా విడుదల చేసిన సర్వేలో పేర్కొంది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 52 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

పొదుపు పడకేసింది

- **దేశంలో ఏటేటా పడిపోతున్న హౌస్‌హోల్డ్ సేవింగ్స్**
- **2022-23లో రూ.14.16 లక్షల కోట్లకే పరిమితం**
- **2020-21తో పోల్చితే రూ.9.13 లక్షల కోట్లు తగ్గుముఖం**
- **భారీగా పెరిగిన ఖర్చులు, రుణ భారం.. కేంద్ర ప్రభుత్వ గణాంకాల్లో వెల్లడి**

న్యూఢిల్లీ, మే 7: దేశంలో గృహస్తుల పొదుపు మందగించింది. 2020-21 ఆర్థిక సంవత్సరం తర్వాతి నుంచి ఏటా క్షీణిస్తూనే ఉండటం గమనార్హం. ఈ క్రమంలోనే 2022-23లో రూ.14.16 లక్షల కోట్లకే నికర సేవింగ్స్ పరిమితమైయ్యాయి. 2020-21లో గరిష్ఠంగా రూ.23.29 లక్షల కోట్లుగా ఉన్నది. దీంతో నాటితో పోల్చితే రూ.9.13 లక్షల కోట్లు క్షీణించినట్టైంది. 2021-22లోనూ రూ.17.12 లక్షల కోట్లకు దిగజారగా.. అప్పటితో చూసినా ఐదేండ్ల కనిష్ఠానికి పతనమైనట్టు తేలింది. ఈ మేరకు కేంద్ర గణాంకాలు, కార్యాచరణ అమలు మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన జాతీయ పద్దు గణాంకాలు-2024 వివరాలు చెప్తున్నాయి. ఇక 2017-18లో దేశీయ నెట్ హౌస్‌హోల్డ్ సేవింగ్స్ తక్కువగా రూ.13.05 లక్షల కోట్లుగా ఉన్నాయి. అయితే 2018-19లో రూ.14.92 లక్షల కోట్లకు, 2019-20లో రూ.15.49 లక్షల కోట్లకు పెరిగాయి.

రుణ భారం రెట్టింపు

2020-21తో పోల్చితే 2022-23లో గృహస్తుల రుణ భారం కూడా రెట్టింపైంది. నాడు రూ.6.05 లక్షల కోట్లుగానే ఉన్నది. అయితే 2021-22లో రూ.7.69 లక్షల కోట్లకు, 2022-23లో రూ.11.88 లక్షల కోట్లకు గృహస్తుల రుణ భారం పెరిగింది. కాగా, ఆర్థిక సంస్థలు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) ద్వారా తీసుకున్న రుణాలు కూడా పెరిగాయి. 2022-23లో ఏకంగా రూ.3.33 లక్షల కోట్లను తాకాయి. 2020-21లో రూ.93,723 కోట్లుగానే ఉన్నాయి. 2021-22లో మాత్రం రూ.1.92 లక్షల కోట్లుగా ఉన్నట్టు తాజా గణాంకాల ద్వారా స్పష్టమైంది.

పెట్టుబడుల్లో..

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో గృహస్తుల పెట్టుబడులు 2022-23లో రూ.1.79 లక్షల కోట్లకు చేరాయి. 2020-21లో రూ.64,084 కోట్లే. 2021-22లో రూ.1.6 లక్షల కోట్లుగా ఉన్నాయి. అలాగే షేర్లలో, డిబెంచర్లలోనూ పెరిగాయి. 2022-23లో రూ.2.06 లక్షల కోట్లుగా ఉన్నట్టు తేలింది. 2020-21లో రూ.1.07 లక్షల కోట్లే. 2021-22లో మాత్రం రూ.2.14 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. మొత్తంగా 2020-21 నుంచి దేశంలోని గృహస్తుల పొదుపు తగ్గి, రుణ భారం పెరిగినట్టు స్పష్టమవుతున్నది. ముఖ్యంగా కరోనా ప్రభావం మాత్రం దేశ ప్రజల ఆర్థిక స్థితిగతులపై పెద్దగానే పడినట్టు కనిపిస్తున్నది. మహమ్మారి దెబ్బకు తలకిందులైన దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ అంటూ ఊదరగొట్టిన కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధికి ఈ తాజా లెక్కలు మాత్రం నిలువుటద్దంలా నిలుస్తున్నాయి.

పడేసిన బ్లూచిప్ సంస్థలు

383 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై, మే 7: దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లు నష్టాల్లో ట్రేడవడంతో ఒక దశలో 600 పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీ చివరకు ఈ నష్టాలను భారీగా తగ్గించుకోగలిగింది. ఈక్విటీ డెరివేటివ్ ట్రేడింగ్ సమయాన్ని పొడిగించాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ) ప్రతిపాదనను స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తిరస్కరించింది. స్టాక్ బ్రోకర్ల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా సెబీ ఈ నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ట్రేడింగ్ సమయం ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు ఉన్నది. మార్కెట్లో పవర్‌గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ నష్టపోగా..హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, నెస్లె, ఐటీసీ, విప్రో, టీసీఎస్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ, యుటిలిటీ, కమోడిటీస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, టెలికం రంగ షేర్లు నాలుగు శాతం వరకు నష్టపోగా..ఐటీ, టెక్నాలజీ షేర్లు లాభపడ్డాయి.

ట్రేడింగ్ సమయం పొడిగించం: సెబీ

టీల సమయాన్ని పొడిగించే ప్రతిపాదనేది లేదు..సెబీకి అవసరమైన సమాచారాన్ని స్టాక్ బ్రోకర్లు ఇవ్వలేరని, దీంతో సమయం పొడిగించే ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నట్టు ఎన్ఎస్ఈ ఎండీ, సీఈవో అశిశ్ కుమార్ చౌహాన్ తెలిపారు. స్టాక్ మార్కెట్లు ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.30 గంటల వరకు కొనసాగనున్నాయి. బ్రేక్ తర్వాత సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రేడింగ్, కమోడిటీ డెరివేటివ్ సమయాన్ని రాత్రి 11.55 గంటల వరకు పెంచాలనే ప్రతిపాదన తీసుకొచ్చింది.

18న స్టాక్ మార్కెట్లలో ప్రత్యేక ట్రేడింగ్

ఈ నెల 18న బీఎస్ఈతోపాటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ)లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించబోతున్నారు. ప్రాథమిక సైట్‌లో ఏదైన అంతరాయాన్ని ఎదుర్కొనేందుకు ఈ ప్రత్యేక సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. ప్రైమరీ సైట్ ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు, డీఆర్ సైట్ 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ట్రేడింగ్‌ను నిర్వహించనున్నారు.

రెడ్డీస్ లాభం 1,307 కోట్లు

క్యూ4లో 36 శాతం పెరిగిన ప్రాఫిట్

హైదరాబాద్, మే 7: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్ అంచనాలకుమించి రాణించింది. అమెరికాలో కంపెనీ ఔషధాలకు పెరిగిన డిమాండ్‌తో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,307 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.959 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 36 శాతం అధికం. 2022-23 ఏడాది నాలుగో త్రైమాసికంలో రూ.6,297 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం గత త్రైమాసికానికిగాను 12 శాతం వృద్ధితో రూ.7,083 కోట్లకు ఎగబాకింది.

- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.27,916కోట్ల ఆదాయంపై రూ.5,568 కోట్ల నికర లాభాన్ని గడించింది.
- ఉత్తర అమెరికా నుంచి రూ.12,990 కోట్ల ఆదాయం సమకూరింది. అమ్మకాలు పుంజుకోవడం, మేనీ పోర్ట్‌ఫోలియో, ఫారెక్స్ అధికం కావడం ఇందుకు దన్నుగా నిలిచాయి.
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి 4640 కోట్ల ఆదాయం లభించింది.
- రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.40 తుది డివిడెండ్(800 శాతం)ను కంపెనీ ప్రతిపాదించింది.

> అమెరికాలో అంచనాలకు మించి రాణించడం వల్లనే గత ఏడాది ఆశాజనక పనితీరు కనబరిచాం. -జీవీ ప్రసాద్, డాక్టర్ రెడ్డీస్ కో-చైర్మన్, ఎండీ

సీఎమ్మార్‌లో అక్షయ తృతీయ వేడుకలు

హైదరాబాద్, మే 7: అక్షయ తృతీయ సందర్భంగా సీఎమ్మార్ ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నెల 12 వరకు ఉండనున్న ఈ ఆఫర్లలో ప్లెయిన్ జ్యూయలరీ తరుగు 3 శాతం నుంచి 9 శాతం వరకు మాత్రమే, యాంటిక్-స్టోన్-రోజ్ గోల్డ్-వికోరియన్ జ్యూయలరీపై ఫ్లాట్‌గా 14 శాతం(అంతకుమించి తరుగు లేదు), వెండి వస్తువులపై తరుగు, మజూరిని ఎత్తివేసిన సంస్థ..డైమండ్ జ్యూయలరీ రూ.49,900 ప్రారంభ ధరతో లభించనున్నాయని తెలిపింది. అలాగే నచ్చిన ఆభరణాలను అడ్వాన్స్ బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. బుక్ చేసిన రోజు లేదా డెలివరీ తీసుకునే రోజు రేట్లలో ఏది తక్కువగా ఉంటే ఆ ధరకు కొనుగోలు చేయవచ్చును.

టీటీకే ప్రిస్టేజ్ ఎక్స్చేంజ్ ఆఫర్లు

హైదరాబాద్, మే 7: ప్రముఖ గృహోపకరణాల సంస్థ టీటీకే ప్రిస్టేజ్ ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టింది. 'ఏదాని కోసం ఏదైనా(ఎనీథింగ్ ఫర్ ఎనీథింగ్) ఎక్స్చేంజ్ ఆఫర్ పరిచయం చేసింది. కష్టమర్ దగ్గర ఉన్న పాత వంట సామాను లేదా వంట గది ఉపకరణాలను తీసుకొని వచ్చి కొత్త వాటిని మార్చుకునే అవకాశం కల్పించింది సంస్థ. ఏ బ్రాండ్‌కు చెందిన ఉపకరణాలను తీసుకొచ్చి కొత్త ప్రిస్టేజ్ వస్తువును తీసుకుపోవచ్చునని కంపెనీ చీఫ్ సేల్స్, మార్కెటింగ్ అధికారి అనిల్ గుర్నానీ తెలిపారు. కొత్త వస్తువులపై 24 శాతం నుంచి 64 శాతం వరకు తగ్గింపు ధరకే పొందవచ్చునన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ జూన్ 30 వరకు అమలులో ఉండనున్నదని పేర్కొంది.

భారత్‌పై విదేశీ ప్రభుత్వ ఫండ్ల పట్టు

- **భారీగా పెరుగుతున్న ఆస్తులు**
- **రూ.4.7 లక్షల కోట్లకు చేరిక**

న్యూఢిల్లీ, మే 7: భారత్‌లో సావరిన్ వెల్త్ ఫండ్స్ (విదేశీ ప్రభుత్వ ఫండ్లు)కు చెందిన మొత్తం సెక్యూరిటీలు (ఆస్తులు) ఈ ఏప్రిల్‌తో ముగిసిన ఏడాది కాలంలో దాదాపు 60 శాతం పెరిగాయి. దీంతో రూ.4.7 లక్షల కోట్లకు చేరినట్టు నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) తెలిపింది. నిరుడు ఏప్రిల్ నాటికి ఇవి రూ.3 లక్షల కోట్ల వద్దే ఉన్నాయన్నది. మరోవైపు మొత్తం విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) ఆధ్వర్యంలోని ఆస్తులు సుమారు 40 శాతం పెరిగి ఈ ఏడాది రూ.69.5 లక్షల కోట్లను తాకడం విశేషం.

అనుకూల పాలసీలు

గత ఐదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం ఈ ఫండ్